గ్రానైట్ మాఫియా పై చర్యలు తీసుకోండి

తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సిఎస్‌లకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గంలో గ్రానైట్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని తమిళనాడు, ఆంధ్రరాష్ట్రాల సిఎస్‌లకు మంగళవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడు లేఖ రాయడం జరిగింది. ఈలేఖలో కుప్పం నుండి రాత్రి సమయంలో గ్రానైట్ మాఫియా గుట్టు చప్పుడు కాకుండా తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా రవాణా చేస్తున్నారని ప్రభుత్వ ఆదాయాలకు గండి కొట్టి కొంతమంది వ్యక్తులు ఈ కార్యకలాపాలు చేస్తున్నారని, కావున తక్షణమే చర్యలు తీసుకొని అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఈ లేఖలో ఆయన పేర్కొన్నారు.

ఈనెల 15 నాటికి దళిత వాడల

శ్మశాన వాటికలు పూర్తి చేయండి

రెవెన్యూ అధికారులను ఆదేశించిన కలెక్టర్

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో దళితవాడలలో శ్మశాన వాటికల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని ఈ అంశంపై ఆర్‌డిఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దష్టిపెట్టి పనిచేయాలని కలెక్టర్ యం. హరినారాయణన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రామపంచాయతీలలోని దళితవాడలలో శ్మశాన వాటికలు, రీసర్వే, అసైన్మెంట్ ల్యాండ్, ల్యాండ్ అక్విటెన్స్, 22ఎ, ఎఫ్‌పిఓఎల్ఆర్, తదితర అంశాలపై ఆర్డీఓలు, తహశీల్దార్లు, మండల, గ్రామసర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితవాడలలో స్మశాన వాటికల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యతని స్తున్నదని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఈ నెల 15 నాటికి పూర్తి చేసి హద్దులు నిర్ణయించి బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 1న రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమంను ప్రారంభిస్తారని అన్నారు. నిరుపేదలకు భూపంపిణీ కోసం అసైన్మెంట్ భూములు వ్యవహారంలో ఎలాంటి తప్పులు దొర్ల కుండా ఈనెల 15 నాటికల్లా జాగ్రత్తగా పరిశీలన చేసి కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలని మండల తహశీల్దార్లను ఆదేశించారు. స్వమిత్రా సంబంధించి జిల్లాలో మొదటివిడతలో కొన్ని గ్రామాలలో పెండింగ్ ఉన్నాయని వెంటనే పూర్తిచేయాలని అన్నారు. భూహక్కు పత్రాలకు సంబంధించి జిల్లాలో భూహక్కు పత్రాలను పంపిణీ చేయడం జరిగిందని, ఇక మిగిలినవి కూడా వెంటనే పంపిణీ చేయడానికి సంబంధిత తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రోన్ ద్వారా రీసర్వే 100 శాతం పూర్తయిందని, ఇంకా రెండు గ్రామాల్లో పూర్తి చేయవలసి ఉందని, ఈ గ్రామాలలో వెంటనే పూర్తిచేయాలని సూచించారు. 22ఎకు సంబంధించి పెండింగులో ఉన్న మండలాలలో పూర్తి చేయాలన్నారు. మిగిలిన కుప్పం, శాంతిపురం, వి.కోట బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం, బంగారుపాళ్యం, చిత్తూరు, పూతలపట్టు, తవణంపల్లి, ఐరాల, గంగాధర్ నెల్లూరు, రొంపిచెర్ల మండలాలలో కూడా పూర్తిచేసి గురువారాని కల్లా కలెక్టర్ కార్యాలయం పంపించాలన్నారు. వెంటనే సీసీఎల్ఏ పంపడం జరుగుతుందని తెలిపారు. ల్యాండ్ అక్వేదేషన్‌కు సంబంధించి పుంగనూరు, గుడిపల్లి మండలాల్లో పెండింగ్ ఉందని గురువారం నాటికల్లా పూర్తి చేయాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. ఆధార్ సీడింగ్ పెండింగ్ లేకుండా పూర్తిచేయాలన్నారు. జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించుకోవాలని చిత్తూరు ఆర్డీఓను ఆదేశించారు. డిఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 11న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో మండలాల పరిధిలో భూసమస్యలకు సంబంధించిన ఎక్కువ కేసులు పరిష్కరించడానికి సంబంధిత తహశీల్దార్లు చర్యలు తీసుకోవాలని, మీ మండలాలలో ఎన్ని కేసులు పరిష్కరించే అవకాశం ఉందో వాటి వివరాలను కలెక్టర్ కార్యాలయానికి పంపించాలన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

మంత్రి పెద్దిరెడ్డి

వికోటలో మామిడి కాయల మండీల నిర్మాణపనులు పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి- వికోట: రాష్ట్రంలోని రైతుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని శివునికుప్పం సమీపంలో పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మామిడి కాయల మండీల నిర్మాణ పనులను వారు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు రాబోవు మామిడి కాయల సీజన్‌కు మార్కెట్లు రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రైతులు వ్యాపారులకు సౌకర్యవంతంగా మౌలికసదుపాయాల కల్పనకు ప్రత్యేకచర్యలు తీసుకోవాలని సూచించారు. సుదీర్ఘకాలంగా రైతులు పడుతున్న అవస్థలను వారి సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో మంత్రి పెద్దిరెడ్డి సహకారంతో ఈనిర్మాణాలను చేపట్టినట్లు ఎమ్మెల్యే వెంకటే గౌడ తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, మాజీ రెస్కో చైర్మన్ ఆర్‌హెచ్.జయరాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఎమ్మార్ ఆంజనేయులు, జిల్లా పరిషత్ సలహా మండలి సభ్యులు గౌస్, బైరెడ్డిపల్లి కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

కుప్పం: మంగళవారం విద్యుత్ అటవీ పర్యావరణ భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పంలో పర్యటించారు. ఈసందర్భంగా అయన వైయస్ జేమ్స్ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో వికలాంగులకు ద్విచక్ర వాహనాలు పంపిణీ చేశారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్, జివిఎస్.రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్థానిక తిరుపతి గంగమాంబ ఆలయాన్ని సందర్శించారు. ఎమ్మెల్సీ భరత్, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

ఎమ్మెల్సీ షేక్‌సాబ్జీ

ప్రజాశక్తి- పులిచెర్ల: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థులు బాబురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి గెలిపించాలని ఎమ్మెల్సీ షేక్‌సాబ్జీ అభ్యర్థించారు. సోమవారం కల్లూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి మాట్లాడుతూ ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బాబురెడ్డి, పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెంకటేశ్వరరెడ్డి పోటీ చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు, చిరుద్యోగులకు అండగా నిలిచేందుకు మొదటిప్రాధాన్యత ఇస్తామని అన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వంటి వెట్టిచాకిరి విధానాల రద్దుకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల కల్పనకు పాతపెన్షన్ విధానం పునరుద్ధరణకు కషి చేస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికవర్గ ఉద్యమాలకు అండగా నిలుస్తామన్నారు. తమకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి.రమణ, నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ డైరీ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

పులిచెర్ల ఎంఆర్సీ కార్యాలయంలో మంగళవారం ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్‌సాబ్జి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు నిస్వార్థసేవలు అందించాలని అన్నారు. పేదవిద్యార్థుల విద్యాభివద్ధికి యుటిఎఫ్ శ్రమించాలన్నారు. యూటీఎఫ్ బలోపేతానికి సంఘటితంగా ముందుకు సాగాలని తెలిపారు. ఎంఇఓ సిద్ధరామయ్య, ఉపాధ్యాయులు జీవీ రమణ, రాధాకష్ణ, ఈశ్వర్ మహేంద్ర, మధుసూదన్ రెడ్డి, భాను ప్రకాష్, నానికేనాయక్, కళావతి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పుష్పక్ టౌన్ టాపర్

పుష్పక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సునిల్ చౌదరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్‌టిఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో చిత్తూరు నగరంలోని నారాయణ కళాశాలకు చెందిన ఆర్‌వి.పుష్పక్ అనే విద్యార్థి 98.91 మార్కులతో ఉత్తమ ర్యాంక్ సాధించారని, చిత్తూరు నగరంలో ప్రథమస్థానంలో నిలిచారని ఆ కళాశాల ప్రిన్సిపల్ సునీల్ చౌదరి తెలిపారు. మంగళవారం ఉదయం విడుదలైన ఎన్‌టిఏ జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ కళాశాలకు చెందిన ఆర్‌వి.పుష్పక్ ఉత్తమ ర్యాంక్ సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థి పుష్పక్ మీడియాతో మాట్లాడుతూ తల్లితండ్రుల ప్రోత్సాహం కళాశాల అధ్యాపకుల ఉత్తమ శిక్షణ ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించగలిగానని వారికి కతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా డిజిఎం కొండలరావు, కోర్‌డీన్ ఏఎస్ రావు, డీన్ చక్రవర్తి, ప్రిన్సిపల్ సునీల్ చౌదరి, ఏవో రాజశేఖర్, ఖాజాజాన్, విద్యార్థి పుష్పక్, తల్లిదండ్రులు విజయభాస్కర్, అనురాధను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పుష్పగుచ్చం అందించి దుస్సాల్వతో అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన వివేకానంద విద్యార్థులు

మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరచారని కళాశాల అధినేతలు సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. సాయితేజారెడ్డి 98.69, నితిన్ 96.12, మోహనకృష్ణ 93.16, రేష్మ 92.19, పవన్‌తేజ్ 91.04, హేమశ్రీ 90.83, దీపా 90.55, జోషితారెడ్డి 90.33 మార్కులు సాధించిన్నట్లు పేర్కొన్నారు. ఉత్తమఫలితాలు సాధించడంలో కృషిచేసిన అధ్యాపకులు, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను కళాశాల కరెస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పకడ్బందీగా 'క్లాప్' కార్యక్రమాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: "క్లాప్" (క్లీన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమాలను వార్డుల్లో పకడ్బందీగా అమలు చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. క్లాప్ అమలుపై మంగళవారం ఎంహెచ్ఓశానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. క్లాప్ అమలులో ప్రధానమైన యూజర్ చార్జీలు వసూళ్లపై వార్డుల వారీగా సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నగరాలను చెత్తరహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం క్లాప్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విషయాన్ని క్షేత్రస్థాయిలో గహస్తులకు, వ్యాపారస్తులకు, దుకాణదారులకు వివరించాలన్నారు. ప్రత్యేకించిన ఆటోల ద్వారా ఇంటింటికి చెత్తసేకరణ కార్యక్రమాన్ని వివరించాలని, యూజర్ ఛార్జీలు చెల్లించడం ద్వారా కలిగే లాభాలను వివరించి, అవగాహన కల్పించాలన్నారు. కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ నుంచి యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. వారాంతానికి నిర్దేశించిన లక్ష్యం మేరకు క్లాప్‌లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకానాథం, నరసింహ, వార్డు పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

టిడిపి అధికారంలోకి వస్తే...

చిత్తూరు జిల్లాకు యూనివర్సిటీ

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

చిత్తూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: టిడిపి అధికారంలోకి వస్తే చిత్తూరు జిల్లాకు యూనివర్సిటీ, హంద్రీనీవా పనులు పూర్తి చేస్తామన్నారు. చిత్తూరులో వైసిపి హయాంలో ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు భూకబ్జాలకు అంతులేకుండా పోయిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. చిత్తూరులో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే కమీషన్ సమర్పించుకోవాల్సిందేనని, కమీషన్లు ఇచ్చుకోలేకే చిత్తూరుకు ఫ్యాక్టరీలు రావడం లేదన్నారు. యువగళం పాదయాత్ర 13వ రోజు మంగళవారం చిత్తూరు టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమీక్ష నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు టిడిపి జిల్లా కార్యాలయం సమీపంలో బహిరంగసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ చిత్తూరు ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు భూకబ్జాలకు పాల్పడుతూ, ఇంటినిర్మాణాలు, కాంట్రాక్టులు, ఫ్యాక్టరీల అనుమతులకు 10-20 శాతం కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనన్నారు. మైనింగ్, అక్రమ మద్యం మాఫియాకు జిల్లాను అడ్డాగా మార్చేశారన్నారు. వైకాపా నాయకులు మద్యం తయారీ అమ్మకాల్లో కీలకంగా ఉన్నారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియంతలా వ్యవహరిస్తూ వైకాపా నేతల అక్రమ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నామన్నారు. చిత్తూరు ఎంఎల్ఎ భూకబ్జాలకు అంతులేకుండా పోయిందన్నారు. గుడిపాల మండలం నాగగల్లు ప్రాంతంలో 300 ఎకరాలు కబ్జా చేశారని, చిత్తూరు - తచ్చూరు రోడ్డులో ఎంఎల్ఎ అన్నకొడుకు శివకుమార్ అక్రమ మైనింగ్‌తో ఆరు కోట్లు కాజేశారన్నారు. చివరకు సిఎం రిలీఫ్‌ఫండ్‌లోనూ పర్సంటేజీలు తీసుకునే దౌర్భాగ్య స్థితికి చేరుకున్నారన్నారు. తమ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు, పసుపుకుంకుమ అందిందని, జగన్ ప్రభుత్వంలో ఉద్యోగాలను ఊడగొట్టి ఉద్యోగులకు నెలనెలా జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, తిరుపతి మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ, చిత్తూరునగర అధ్యక్షురాలు కఠారి హేమలత, పార్లమెంటరీ అధ్యక్షులు పులివర్తినాని, ఎంఎల్‌సి దొరబాబు, నాయకులు సురేంద్రకుమార్, సప్తగిరి ప్రసాద్, హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

కడపనత్తం సచివాలయంలో కలెక్టర్ తనిఖీలు

సిబ్బంది పనితీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలో జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాలు, జగనన్న లేఅవుట్లతో జరుగుతున్న పనులను పరిశీలించారు. మండలంలోని బేలుపల్లి పంచాయతీ పరిధిలోని బేలుపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థుల బరువును తూకం వేసి ప్రతి పిల్లవాడికి పౌష్టికాహారం అందించి ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించిన ట్యాబుల గురించి విచారించారు. ఉపాధ్యాయులు నందకుమార్ మాట్లాడుతూ 36 ట్యాబులు మంజూరు కాగా వాటిలో 31 ట్యాబులు విద్యార్థులకు, 5 ట్యాబులు ఉపాధ్యాయులు వినియోగిస్తున్నట్లు వివరించారు. బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్‌లో దారి సమస్యను పరిష్కరించడానికి, దారి మరమ్మతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జగనన్న లేఅవుట్ వద్దకు చేరుకుని హౌసింగ్ డీఈ ద్వారా పుంగనూరు జాతీయదారి నుంచి జగనన్న లేఅవుట్ వరకు ఉన్న దారిని పరిశీలించి మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. అలాగే కడపనత్తం సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ పథకాలు అందించిన వివరాలు నోటీసు బోర్డులో లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పట్టికను తనిఖీ చేసి వాలంటీర్లు హాజరు 16 శాతం ఉండటంతో సిబ్బందిపై మండిపడ్డారు. సచివాలయంలో సరిగా పనిచేయని వారికి నోటీసులు ఇవ్వాల్సిందిగా ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ కుమారస్వామి, సర్పంచ్ వెంకటేష్, ఎంపిటిసి, హౌసింగ్ ఏఈ స్వామిదాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హరినారాయణన్

టిడ్కో గృహాల్లో వేగంగా మౌలిక సదుపాయాలు



టిడ్కో ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టిడ్కో గహాల్లో మౌలిక సదుపాయాల పనులు వేగంగా పూర్తిచేయించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ టిడ్కో అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కమిషనర్ నగరపాలక పరిధిలో పూనెపల్లి వద్ద ఉన్న టిడ్కోగహ సముదాయాలను పరిశీలించారు. గహ సముదాయాల వద్ద రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువలు, వాటర్ సప్లై పనులు త్వరగా పూర్తి చేయించాలని అన్నారు. గహాల్లో సానిటేషన్ పనులు రెండు వారాల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. అనంతరం గహాల్లో ఇటీవల చేపట్టిన పనులను పరిశీలించారు. విద్యుదీకరణ పనులు త్వరగా ప్రారంభించేలా అధికారాలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులన్నీ ఉగాది నాటికి పూర్తిచేయించాలని టిడ్కో అధికారులను ఆదేశించారు. డీఈ వెంకట ముని, సీఎంఎం గోపి, టిడ్కో ఏఈ ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

జల్లికట్టులో అపశృతి.. వ్యక్తి మృతి

జల్లికట్టులో మృతి చెందిన శీనప్ప

ప్రజాశక్తి- వికోట మండల పరిధిలోని ఎర్రినాగేపల్లిలో మంగళవారం నిర్వహించిన జల్లికట్టులో అపశృతి చోటుచేసుకుంది. ఎద్దులను నిలువరించే క్రమంలో ఎద్దు ఢీకొనడంతో మోర్నపల్లికి చెందిన శీనప్ప(54) మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరో నలుగురికి తీవ్రగాయాలు కాగా వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో జల్లికట్టు నిర్వహించే క్రమంలో ప్రమాదవశాత్తు శీనప్పను ఎద్దు ఢీకొంది. గమనించిన స్థానికులు హుటాహుటిన వి.కోట ప్రభుత్వాసుపత్రికి శీనప్పను తరలించారు. వైద్యులు పరీక్షించి అతను అప్పటికే మతిచెందినట్లు ధవీకరించారు. మతునికి భార్య, కుమారుడు ఉన్నారు. వికోట ప్రభుత్వాసుపత్రి వద్ద బంధువులు కుటుంబ సభ్యుల ఆర్తనాధాలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదుచేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పెద్దిరెడ్డిని విమర్శిస్తే ఊరుకోం..

పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పాదయాత్ర జరుపుకో.. అయితే లేనిపోని ఆరోపణలు చేస్తూ పెద్దిరెడ్డిని విమర్శిస్తే ఊరుకొనేది లేదని పూతలపట్టు ఎంఎల్ఏ ఎంఎస్ బాబు నారా లోకేష్‌ను హెచ్చరించారు. మంగళవారం స్థానిక బెంగుళూరు బైపాస్‌లోని నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నారా లోకేష్ వ్యాఖ్యలపై ఎంఎస్ బాబు ఘాటుగా స్పందించారు. విమర్శించే స్థాయి, శక్తిలేని లోకేష్ తమ నాయకులపై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కబ్జాలు, అక్రమాలకు పాల్పడింది టిడిపి నాయకులేనని అందుకే గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రప్రజలు తెలుగుదేశం పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఆ విషయాన్ని అప్పుడే మరిచిపోయారా వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. కనీస అవగాహనలేని లోకేష్ పాదయాత్ర పేరుతో విమర్శిసూ సహించేది లేదని హెచ్చరించారు. ఐరాల మండలంలో నిర్వహించిన పాదయాత్రకు ఇతర ప్రాంతాల నుంచి జనం తెచ్చుకున్నారని జనంలేని యువగళం యాత్రతో ఏం సాధిస్తారన్నారు. జగన్ సంక్షేమ పథకాలకు ప్రజలు జేజేలు పలుకుతున్న విషయన్ని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పి వైఎస్‌ఛైర్మెన్ ధనంజయరెడ్డి, జెడ్‌పిటీసీలు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం దర్గామిట సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో డిస్ప్లే చేసిన సంక్షేమ పథకాలు, అర్హులైన లబ్ధిదారుల జాబితాను పరిశీలించి, అప్డేటెడ్ లిస్ట్‌ను, వాల్‌పోస్టర్లను డిస్ప్లే బోర్డులో వెంటనే పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డు సచివాలయంలో ఆన్లైన్, ఆఫ్‌లైన్ అటెండన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అటెండన్స్ రిజిస్టర్‌లో ఎంట్రీస్, మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో క్యాంపు వివరాలు వెంటనే నమోదు చేయాలన్నారు. రోజువారీ స్పందన, గ్రీవెన్స్‌లను వెంటనే పరిష్కరించి, విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని సూచించారు.

సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పి సీఈఓ

ప్రజాశక్తి
www.prajasakti.com

గృహహక్కు పథకం ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాశక్తి- సోమల: జగనన్న సంపూర్ణ గహహక్కు పథకం కింద ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్టు కందూరు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం రూ.10వేలు చెల్లించిన వారికి ఇంటిస్థలం పట్టా పొందే అవకాశం కల్పించిందని తెలిపారు. కందూరు పంచాయతీలో పలువురు డబ్బులు చెల్లించిన వారికి ధ్రువపత్రాలను పంపిణీ చేయడం జరిగిందని, మరి కొంతమందికి కూడా త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-పాలసముద్రం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎపిడి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.విద్యావతి ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీడి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధిహామీ కూలీలు రెండుపూట్ల ఫోటో ఆన్లైన్ అప్లోడ్ చేస్తేనే వారికి కూలీలు సక్రమంగా వస్తుందని తెలిపారు. జాబ్ కార్డ్ కలిగిన ప్రతికుటుంబానికి పనులు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో బాల, ఈసీ అనూష, ఉపాధి హామీ సిబ్బందులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాల రికవరీ మెరుగుపడాలి

ప్రజాశక్తి -పాలసముద్రం: డ్వాక్రా సంఘాల సభ్యులు తక్కువవడ్డీతో ఇస్తున్న శ్రీనిధి రుణాలను రికవరీ మెరుగుపడాలని ఏజీఎం ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఐకెపి కార్యాలయంలో ఏపీఎం ఫరీద్‌మస్తాన్ సమీక్షంలో శ్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలకు, సంఘమిత్రాలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏటీఎం ప్రకాష్ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలని ఉద్దేశంతో ప్రభుత్వం తక్కువ వడ్డీతో శ్రీనిధి రుణాలను అందిస్తుందని తెలిపారు. శ్రీనిధి తీసుకున్న మహిళలు కంతులప్రకారం సక్రమంగా చెల్లిస్తే వారికి మరింత ఎక్కువ శ్రీనిధి రుణాలు ఇస్తారని తెలిపారు. ఇవేకాక బ్యాంకులో తీసుకున్న రుణాలను కంతులు ప్రకారం సక్రమంగా కట్టుకుంటే ఒక మహిళలకు లక్ష యాభై వేలు రుణాలు ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ముందు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ లావణ్య, సిసి చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, మంజుల, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి- సోమల: మండలంలోని సూరయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సవిత కలసి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతప్తి వ్యక్తం చేశారు.

ఉపాధి పనులు 200 రోజులకు పెంచాలి

ప్రజాశక్తి- పలమనేరు: గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు 200రోజులకు పెంచాలని బికెఎం జిల్లాకార్యదర్శి మద్దెల సుబ్రమణ్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా మంగళవారం దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) భారతీయ కేతే మజ్దూర్ యూనియన్ (బికేఎంయు) రాష్ట్ర సంఘాల పిలుపుమేరకు దళితుల సంక్షేమం, పథకాలు పట్ల, గ్రామీణ ఉపాధి కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా తమ నాయకులతో కలిసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహనికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల పైన దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలు భూములు లాక్కోవటం అధికంగా జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని, నిత్యావసరాల ధరలను తగ్గించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో దళితులే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి బుర్ర మంజునాథ్ బాబు, కె.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్సై

ప్రజాశక్తి- పలమనేరు: మండలంలోని కోలమాసనపల్లి గ్రామంలో ఈనెల 10వ తారీకు జల్లికట్టు నిర్వహించబడునని కొందరు వ్యక్తులు వాట్సాప్‌లో, సోషల్ మీడియాలో వైరల్ చేయడం జరిగింది. ఇదిపూర్తిగా తప్పుడు సమాచారమని అక్కడ జల్లికట్టు జరగడానికి ఎలాంటి పోలీసు వారి అనుమతులు లేవని కాబట్టి ఎవరైనా జల్లికట్టు నిర్వహించినా, అందులో పాల్గొన్న వారందరిపై చట్టపైనచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిరుధాన్యాలతో అధిక ఆదాయం

జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు నాగ పద్మని

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: చిరుధాన్యాలతో అధిక ఆదాయం సమకూర్చుకోవచ్చునని జిల్లా వ్యవసాయ సహాయసంచాలకులు నాగపద్మని అన్నారు. మంగళవారం మండలంలోని మహాసముద్రం గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో జీవో 20 సదస్సుపై మహిళలకు ఒక్కరోజు శిక్షణాకార్యక్రమం ఆర్‌బికె సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్తూరు జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ సహాయ సంచాలకులు నాగపద్మని మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం, సుస్థిర వ్యవసాయంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత అని మనిషికి కావలసిన పోషక విలువలు చిరుధాన్యాల అధికంగా ఉన్నాయని తెలిపారు. తక్కువ పెట్టుబడి రైతుకు ఆదాయం ఎక్కువగా లభిస్తుందని వాటిపై రైతులు మక్కువ చూపి సాగు దిగుబడిని అధికం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మజ, ఆర్‌బికె సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి, మహిళా రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి-కార్వేటినగరం: విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన తప్పనిసరి ఉండాలని డీఎం.పురం సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి కారుణ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని డీఎంపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నమశ్శివాయ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు సెల్ఫోన్లకు దూరంగా ఉండాలని, అందులో మంచి చెడులను విధిగా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు, ఆ సాంఘీక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు, మహిళా సంరక్షణ సిబ్బందికి లేదా హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, లేనిపక్షంలో ఫిర్యాదు బాక్సులో సమాచారాన్ని అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి గోపి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

ఆదానీ కంపెనీలపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి -కుప్పం: అదానీ గ్రూప్ కంపెనీలపై సమగ్రవిచారణ జరిపించాలని కుప్పం నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీల చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పిలుపు మేరకు కుప్పంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు పేదలు సొమ్ము దాచుకోవడం కోసం ఎంతో ఇబ్బంది పడేవారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్యాంకుల జాతీయకరణ చేయడంతో పాటు ఎల్ఐసీ వంటి సంస్థలను ఏర్పాటు చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు భరోసా కల్పించిందని చెప్పారు. కానీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వరంగ సంస్థలను, వాటి ఆస్తులను బడా వ్యాపారులకు అప్పగించి, ఆర్థికనేరాలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇటీవల అదానీ గ్రూప్ బ్యాంకుల వద్ద రుణాలు తీసుకుని, తన వ్యాపారాలకు వాడుకుని ఆర్థిక నేరాలకు పాల్పడిందని ఆరోపించారు. దీనిపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట రమణబాబు, పళని, డీకే.చంద్రశేఖర్, మురుగేష్, పురుషోత్తంరెడ్డి, రాజారామ్, జయరాం, గుడికొత్తూరు శ్రీనివాసులు, ఆనంద్ మునుస్వామి, గంగాధర్, బాబు, శంకర్, వెంకటేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి- యాదమరి: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా ఆరోగ్యవిస్తరణ పర్యవేక్షణ అధికారి జయరాముడు స్పష్టం చేశారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ సురేఖ, డాక్టర్ అనిల్ కుమార్ నాయక్‌ల ఆధ్వర్యంలో నెలవారి ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. జయరాముడు, కష్ణారెడ్డి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం మరియు మాత శిశు సంరక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతిఒక్క ఆశ కార్యకర్త మాతా శిశు కార్యక్రమాలు 100శాతం చేయాలన్నారు. ప్రతి గర్భవతిని తప్పనిసరిగా నమోదు చేసుకొని అన్నిరకాల వైద్యసేవలు వైద్యపరీక్షలు అందించాలన్నారు. అలాగే ఆసుపత్రుల్లో సుఖప్రసవం అయ్యేలా వారిని కాన్పులకు తప్పనిసరిగా ఆసుపత్రులకు తీసుకెళ్లాలని అన్నారు. చిత్తూరు జిల్లాలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉందని, కనుక ఆశాలు ఎక్కడైనా గర్భవతులను స్కానింగ్ చేసి ఆడపిల్లలని నిర్ధారణ చేసుకొని అబార్షన్లకు పాల్పడరాదని, అలా జరిగితే శిక్ష తప్పదని హెచ్చరించారు. బ్రుణహత్యలను నివారించేందుకే పిసి పిఎన్డిటి చట్టాన్ని ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. మలేరియా సబ్‌కమిటీ ఆఫీసర్ పీర్ సాహెబ్, హెల్త్ సూపర్వైజర్ నిర్మలమ్మ, ఎంఎల్పిహెచ్‌సిలు మహిళా ఆరోగ్య , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.కోటితో చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: చెన్నకేశవ స్వామి ఆలయ అభివద్ధికి రూ. కోటి రూపాయలతో ప్రతిపాదన పంపుతున్నట్లు ఎండోమెంట్ ఏఈ ఆనంద్ తెలిపారు. ఆయన మంగళవారం రొంపిచెర్ల మండలం, బొమ్మయ్యగారి పల్లి గ్రామపంచాయతీ, పాతకురవ పల్లె కు సమీపంలో వున్న చెన్నకేశవ స్వామి ఆలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి తీసుకుని అభివద్ధి చేయాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఎండోమెంట్ అధికారులకు ఆలయ అభివద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎండోమెంట్ ఏఈ ఆలయాన్ని పరిశీలించి గర్భగుడి, ఆలయ మండపం, గాలిగోపురం, ధ్వజస్తంభం, ఆంజనేయ స్వామి ఆలయం, కోనేరు, ఆలయం చుట్టూ ప్రహరీ గోడ వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయాన్ని అధునాతనంగా నిర్మించడం జరుగుతుందన్నారు. ఎంపిపి చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ, మండల సర్వేయర్ సులోచన పాల్గొన్నారు.

కూలీలు 75 శాతం హాజరయ్యేలా చూడాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఉపాధి హామీ కూలీలు ప్రతి రోజు 75శాతం మంది పనులకు హాజరు అయ్యేలా చూడాలని ఎస్ఆర్ఈజీఎస్ నగరి అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మోహనమురళీ ఆధ్వర్యంలో మండలంలోని ఎన్ఆర్ఆస్ఈజీఎస్ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు కూలీలు 75 శాతం పనులకు వచ్చేలా ఫీల్డు అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా రోజూ 20మంది కూలీల సంఖ్య పెరిగేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కూలీలకు ఆధార్‌సీడింగ్ పూర్తి చేయాలన్నారు. ప్లాంటేన్ సర్వాయివల్ కాప్చర్ కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. పీల్డు అసిస్టెంట్లు, జేఈలు కలసి కూలీలు చేసిన పనుల వివరాలను మానిటర్ చేసి ప్రాజెక్టు డైరెక్టరుకు అందించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయడానికి టీఏలు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీతో జాహ్నవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మదు, టెక్నికల్ అసిస్టెంట్లు, పీల్డు అసిస్టెంట్లు పలువురు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి



ప్రజాశక్తి- బంగారుపాళ్యం : గ్రామాల్లోని వ్యాధిగ్రస్తులను గుర్తించాల్సిన బాధ్యత ఆశ కార్యకర్తలదే అని తుంబుకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చంగల్ రాయలు తెలిపారు. మంగళవారం ఆశాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో లోహిత్ చంగల్‌రాయులు మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం జరపాలని, టిబి, కుష్టు వ్యాధి, జ్వరాలు, జలుబు, దగ్గు విరేచనాలతో బాధపడేవారిని గుర్తించాలని అన్నారు. అలాగే గర్భవతులు సమావేశాలకు హాజరుపరచాలని, హైరిస్క్ గర్భినులపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని, డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన వారి వివరాలు ప్రతి ఆశాకార్యకర్త నమోద చేసి పెట్టుకోవాలని వారిని తరచు పరామర్శించి వైద్యంపై సమస్యలు ఏమైనా ఉన్నచో తెలియజేయాలన్నారు. సిహెచ్‌హెచ్‌ఓ షమీమ్, ఎంపిహెచ్ ఈఓ బహస్పతి, మండల ఆరోగ్య పర్యవేక్షకులు హరికష్ణ, మహిళా సూపర్‌వైజర్లు సుమతి ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో ముస్లిం నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం, కార్వేటినగరం: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌బాబు యువగళం పాదయాత్రలో కార్వేటినగరం మండల ముస్లిం నాయకులు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ ఎస్.పర్వేజ్, మండల కార్యనిర్వాహక కార్యదర్శి కేఎస్.దస్తగిరి, జీడినెల్లూరు ముస్లిం మైనార్టీ అధ్యక్షులు నౌషద్, నియాజ్, ముజీబ్ పాల్గొన్నారు.

నేడు ఆహార భద్రత కమిషనర్ రాక

ప్రజాశక్తి - సోమల: రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్ విజయ ప్రతాప్‌రెడ్డి నేడు చౌకదుకాణాలు, అంగన్వాడీ కేంద్రాలు, ఎస్సీ ఎస్టీ వసతి గృహాలు తనిఖీ చేయడానికి సదుం, సోమల మండలానికి రానున్నట్టు చౌడేపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ సరళాదేవి తెలిపారు. 8వ తేదీ బుధవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో సదుం, సోమల మండలాల్లో ఆయన పర్యటించి తనిఖీలు నిర్వహించనున్నారని సూపర్వైజర్ శంకరమ్మ తెలిపారు.

వెంకటరెడ్డి మృతి తీరని లోటు

ప్రజాశక్తి-రొంపిచెర్ల: దేవలపల్లి వెంకటరెడ్డి మృతిచెందడం వైఎస్ఆర్‌సిపి పార్టీకి తీరనిలోటని జడ్పిటిసి రెడ్డిశ్వర్‌రెడ్డి అన్నారు. రొంపిచెర్ల మండలం, పెద్దమల్లెల గ్రామం గుండ్లకాడపల్లికి చెందిన దేవలపల్లి వెంకటరెడ్డి(85) సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మతిచెందారు. మంగళవారం దేవులపల్లి వెంకటరెడ్డి భౌతిక కాయానికి జడ్పిటిసి రెడ్డిశ్వర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ దేవులపల్లి హరినాథ్‌రెడ్డి, సర్పంచ్ దేవులపల్లి నాగిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

చిరుధాన్యాల సాగుపై శిక్షణ

ప్రజాశక్తి- యాదమరి: చిరుధాన్యాల పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయంపై చిత్తూరు జిల్లా వనరుల కేంద్రం (ఆత్మ) అధికారి లక్ష్మీప్రసన్న శిక్షణ ఇచ్చారు. మంగళవారం మోర్దానపల్లి రైతు భరోసా కేంద్రంలో మహిళ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ. సేంద్రీయ వ్యవసాయం ద్వారానే, ఆర్థిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. వ్యవసాయ అధికారి చరిత అగ్రికల్చర్ అసిస్టెంట్స్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సంతృప్తికరంగా దర్శనం జరగాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంకు వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం సంతప్తి స్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ యం.హరి నారాయణన్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డాక్టర ఎస్.వెంకటేశ్వర్‌తో కలసి కాణిపాకం దేవస్థానం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామివారి దర్శనం జరిగేలా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. ఈఓ వెంకటేశు, చిత్తూరు ఆర్డీఓ రేణుక, డిపిఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో సామూహిక గహప్రవేశాల గడువు దగ్గర పడుతోంది. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ హౌసింగ్, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ నగరపాలక పరిధిలోని తేనెబండ హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హౌసింగ్, సూపర్వైజర్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. వారాంతపు లక్ష్యాలు పూర్తిచేయడం ద్వారా ఉగాది నాటికి అనుకున్న మేర ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి.. ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. వివిధ దశలో సాగుతున్న నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ... స్టేజ్ కన్వర్షన్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు ఆలయ పాలక మండలిలో చోటు

ప్రజాశక్తి -పలమనేరు: నాయిబ్రాహ్మణులకు దేవాలయాల పాలకమండలిలో చోటు కల్పించడంపై నాయిబ్రాహ్మణ సేవాసంఘం రాష్ట్రకార్యదర్శి యుగేంద్ర మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఏపీ నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య అభ్యర్థన మేరకు ప్రజాసంకల్ప యాత్రలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఈమేరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శ్రీశైలం, ద్వారకా తిరుమల, కదిరి, విజయవాడ కనకదుర్గమ్మ గుడి, వంటి ఆలయాల్లో ట్రస్ట్‌బోర్డ్ మెంబర్లుగా నాయిబ్రాహ్మణుల నియమించారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: చిత్తూరు -పుత్తూరు రహదారి మండలంలోని ఎల్లమ్మరాజుపల్లి వద్ద స్కూల్ వ్యాన్‌ని దిచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు యువకులు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. గంగాధర నెల్లూరు మండలం నెల్లెపల్లె పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు ధనశేఖర్ (25) అమరరాజ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు సాయి (23) కాలేజ్‌లో చదువుతున్నాడు. వీరిద్దరూ స్వగ్రామం నుంచి బయలుదేరి చిత్తూరుకు వస్తుండగా అదే సమయానికి గంగాధర నెల్లూరు మండలం సుందరరాజుపురం వద్ద గల ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు ఎల్లమరాజుపల్లి గ్రామంలోకి తిరుగుతుండగా బస్సును స్కూటర్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఢీకొన్నారు. వేగంగా రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలకు గురైయ్యారు. వారిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీబీ బాధితులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి- పలమనేరు: టీబీ వ్యాధితో బాధపడుతున్న వారికి పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక దాతలు శేషు నరసింహులు శెట్టి, రాఘవయ్యల సహకారంతో ఆరు నెలల పాటు నెలకొసారి కందిపప్పు, గోధుమ పిండి, శెనగలు, రాగిపిండి, నూనె, సెనగ గింజలు, కోడి గుడ్లు తదితర పోషకాహారం అందజేశారు. వ్యాధిగ్రస్తులు త్వరగా కోలుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. మరింత మందికి సహకారం అందించడానికి సేవాసంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, పిపిఎస్ ఉపాధ్యక్షులు శ్రీపురం శీతారామయ్య, కార్యదర్శి నరసింహులు, వైద్యశాఖ సిబ్బంది రమేష్‌బాబు, జగదీశ్వరి, పిపిఎ సభ్యులు, జ్ఞానఆళ్వార్, దేవా, గుణ శేఖర్, సన్నీరాజు దొరస్వామి, నారాయణ, రెడ్డప్ప, రామచంద్రా, నిషార్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ప్రజాశక్తి- యాదమరి: ప్రజాసంక్షేమ పథకాలు ప్రతి పేదకుటుంబానికి అందేలా చూడాలని ఎమ్మెల్యే ఎమ్మెస్.బాబు అన్నారు. మంగళవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బోధగుట్టపల్లి గ్రామపంచాయతీలోని పెరగాండ్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రతిగడపనూ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాగలాపురం గ్రామంలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తుందని బాగా చదువుకోవాలని సూచించారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ కాలువలు మంజూరు చేయాలని కోరారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పక్కా ఇండ్లను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నవరత్నాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ప్రజా పరిషత్, మండల అధ్యక్షుడు సురేష్, ఉపాధ్యక్షులు హరినారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు మనోహర్ రెడ్డి, తహశీల్దార్ చిట్టిబాబు, మండల అభివద్ధి అధికారి శివరాజ్, ఎస్సై సుమన్, ఎంఈఓ రుక్మిణి, ఏపీఎం కల్పలత రెడ్డి, ఏపీఓ కవిత, హౌసింగ్ ఏఈ రవి, ట్రాన్స్కో ఏఈ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా రీసర్వే పూర్తి

ప్రజాశక్తి-అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీసర్వే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థపరిధిలో త్వరగా.. తప్పులు లేకుండా పూర్తి చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. అర్బన్ రీసర్వే కార్యక్రమంపై మంగళవారం నగరపాలక కార్యాలయంలో వార్డు అడ్మిన్, ప్లానింగ్ కార్యదర్శులు, వీఆర్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలోని అన్నివార్డుల పరిధిలో వివిధరకాల ఆస్తులకు సంబంధించి అసెస్మెంట్ నెంబర్లను ఆన్లైన్లో అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆన్లైన్లోనే డేటాను ఒకసారి సరిచూసుకొని, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని, సర్వేవివరాలను అంతే జాగ్రత్తగా, తప్పులు లేకుండా ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. సర్వే సందర్భంగా స్థానిక ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనీలు, రీసర్వే ఆన్లైన్ డేటా, అప్లోడింగ్, క్షేత్రస్థాయి సర్వేవివరాల నమోదు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మొగిలి సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి గుడిపాలకు ఇన్నోవా కారులో వెళుతున్న వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడంతో సీఐ నరసింహారెడ్డి వారిని అదుపులో తీసుకుని విచారించారు. గుడిపాల మండలం పిల్లర్‌కుప్పం గ్రామానికి చెందిన నర్సింహులు కుమారుడు చందు, గుడిపాల మండలం బొమ్మసముద్రం గ్రామానికి చెందిన సురేష్ రెడ్డి అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.1.85 లక్షల విలువైన మద్యం, ఇన్నోవా కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు. దాడుల్లో ఎస్సై మల్లికార్జునరెడ్డి, కానిస్టేబుళ్లు సురేంద్ర, మోహన్ పాల్గొన్నారు.